సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం ׀ 8 ׀ జనవరి ׀ 2024



ఆశాజనకంగా 'పట్టు'

పట్టుగూళ్ల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. కిలో రూ.500 నుంచి రూ.550 పలుకుతున్నాయి.

8లో



టమాట కిలో రూ.16

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.4°/ 17.5°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'



పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం, ధర్మవరం, కదిరి ఆర్డీఓ కార్యాలయాలు, మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. వినతి పత్రాలపై ఆధార్, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'స్పందన' నిర్వహిస్తున్నారు. ప్రజలు తమ సమస్యలపై ఎస్పీ మాధవరెడ్డికి నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చు.

రేపటి నుంచి సంక్రాంతి సెలవులు

కదిరి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకూ 10 రోజుల పాటు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి పేర్కొన్నారు. సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని అన్ని పాఠశాలల యాజమాన్యాలను హెచ్చరించారు. సెలవుల అనంతరం ఈ నెల 19న పాఠశాలలు పునః ప్రారంభించాలని ఆదేశించారు.

విధులకు హాజరుకండి

- అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఆదేశం

ప్రశాంతి నిలయం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 8 నుంచి అంగన్‌వాడీ సిబ్బంది విధులకు హాజరుకావాలని జిల్లా మహిళా,శిశు సంక్షేమశాఖ సాధికారిత అధికారి లక్ష్మీకుమారి తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గడువులోగా విధులకు హాజరుకాకపోతే ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని పేర్కొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రాతినిధ్యం



క్రీడాకారుడు పవన్

ధర్మవరం రూరల్: ధర్మవరం మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన వి.పవన్ జాతీయ స్థాయి అండర్–17 కబడ్డీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నాడు. తెలంగాణలో జరగనున్న పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున పవన్ ఆడనున్నట్లు ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు తెలిపారు. ధర్మవరం ఆర్డీటీ క్రీడా మైదానంలో శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పవన్‌ను ఆర్డీటీ సిబ్బంది, కోచ్ పృథ్వీ అభినందించారు.

11న సత్యసాయి సాంస్కృతిక క్రీడా సమ్మేళనం



డ్రాగన్ నృత్యంపై మెలకువలు నేర్పుతున్న కళాకారులు

పుట్టపర్తి రూరల్: సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 42వ సత్యసాయి సాంస్కృతిక క్రీడా సమ్మేళనం ఈ నెల 11న జరగనుంది. వేడుకలకు హిల్ వ్యూ స్టేడియం ముస్తాబవుతోంది. అనంతపురం, బెంగళూరు వైట్ ఫీల్డ్, బృందావనం ముద్దనహళ్లి, సత్యసాయి ప్రైమరీ, హయ్యర్ సెకండరీ, ఈశ్వరమ్మ విశ్వవిద్యాలయాల నుంచి వేలాది మంది విద్యార్థులు పాల్గొని ప్రదర్శనలు ఇవ్వనున్నారు. భారతీయ సంస్కృతికి అద్దం పట్టే కళలు, నృత్యాలు, క్రీడా విన్యాసాలు, జిమ్నాస్టిక్స్, మార్షల్ ఆర్ట్స్, కరాటే, కర్రసాము, కత్తి సాము, బంగీజంప్, లాంగ్ జంప్, బైకు రేసులు, అగ్ని కీలల్లో ప్రదర్శనలతో ఆకట్టుకోనున్నారు. ఈ క్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, చైనా, జపాన్, నేపాల్, థాయిలాండ్ తదితర దేశాలకు చెందిన స్పెషలిస్టులు శిక్షకులు, ప్రతినిధుల బృందం ఆధ్వర్యంలో స్టేడియంలో విద్యార్థులు కఠోర సాధన చేస్తున్నారు. 11న ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 4 గంటలకు క్రీడా విన్యాసాలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వర్గాలు తెలిపాయి.



ఉరవకొండలో ఆదివారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలివచ్చిన అశేష జనవాహినిలో ఒక భాగం



జయజయధ్వానాల మధ్య సాగుతున్న సామాజిక సాధికార బస్సుయాత్ర

ఉరవకొండలో సామాజిక సౌరభం

- బస్సు యాత్ర సూపర్ సక్సెస్
- తరలివచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు
- ప్రతిధ్వనించిన బడుగుల 'సాధికార' నినాదం
- జగన్ పాలనలోనే సంక్షేమం



సామాజిక సాధికార సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, చిత్రంలో ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యేలు శంకరనారాయణ, హఫీజ్‌ఖాన్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, పార్టీ పరిశీలకుడు శ్రీనివాసులు తదితరులు

ఉరవకొండ : రాజకీయ, నామినేటెడ్ పదవులతో పాటు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన బడుగులు 'సామాజిక సాధికార యాత్ర'కు బ్రహ్మరథం పట్టారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఆదివారం ఉరవకొండలో అడుగు పెట్టగానే ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సారథ్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి యాత్ర ప్రారంభమైంది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ముందుకు సాగారు. క్లాక్‌టవర్ సమీపంలోని పాత బస్టాండ్ సర్కిల్‌కు యాత్ర చేరుకుంది. ముఖ్య అతిథులుగా ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, పెనుకొండ ఎమ్మెల్యే, అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మాలగుండ్ల శంకరనారాయణ, అనంతపురం మేయర్ వసీం, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌యాదవ్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థనాయక్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, చేనేత నాయకురాలు చందా చంద్రమ్మ, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు హాజరయ్యారు. ముస్లిం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో ముఖ్య అతిథులకు క్రేన్ సహాయంతో గజమాలను వేశారు. బస్సు యాత్రకు మద్దతుగా యువజన విభాగం నేత వై.ప్రణయ్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథులు ప్రసంగించారు. జగనన్న పాలనలో జరిగిన మేలును, కలిగిన లబ్ధిని వివరించేటపుడు బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు ఈలలు, కేకలు, కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. తమకు సమాజంలో సముచిత స్థానం, అవకాశాలు కల్పించిన సీఎం జగన్‌కు అండగా ఉంటామని, మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొస్తామని నినదించారు.

70 శాతం పదవులు బడుగులకే



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకే 70 శాతం పదవులు దక్కాయి. రాష్ట్రంలో బీసీల ఆత్మగౌరవం పెరిగింది. జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుని బీసీ వర్గాలు మరింత అభ్యున్నతి చెందాలి.

– మాలగుండ్ల శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త

జగనన్న ప్రభంజనం



వైఎస్సార్‌సీపీ పాలనలోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమైంది. నాకు కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా పనిచేసే అవకాశం కల్పించడం గొప్ప విషయం. రాష్ట్రంలో జగనన్న ప్రభంజనం కనిపిస్తోంది. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరు.

– తలారి రంగయ్య, అనంతపురం ఎంపీ



జగన్ నాయకత్వానికి జై కొడుతున్న మహిళలు

జగన్ విజయయాత్రను ఆపలేరు



త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. చంద్రబాబు, పవన్ లాంటి పెత్తందార్లు ఏకమై పేదల పక్షాన నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడానికి కుట్రలు పన్నుతున్నారు. జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం లేక కుటుంబాల్లో చిచ్చులు పెడుతున్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా జగన్ విజయయాత్రను ఆపలేరు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాలు తలెత్తుకునేలా సముచిత స్థానం కల్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఉపముఖ్యమంత్రి పదవులు ఇచ్చారన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.1300 కోట్లు ఖర్చు చేశారు. 3వేల మందికి ఇంటి స్థలాలు, 10 వేల పక్కా గృహాలు మంజూరు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు రూ.128 కోట్ల పంటల బీమా, రూ.30 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ, రూ.175 కోట్ల రైతు భరోసా అందించారు. ఉరవకొండ పట్టణంలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మేలు చేసిన జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

– వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త

నయవంచకుడు చంద్రబాబు



డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మహిళలను నమ్మించి నట్టేట ముంచిన నయవంచకుడు చంద్రబాబు. మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ హామీని అమలు చేయకుండా విస్మరించిన వ్యక్తి.. ఇప్పుడు మళ్లీ మాయమాటలతో జనం ముందుకు వస్తున్నారు. అలాంటి వ్యక్తిని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరు. బీసీలను మోసగించేందుకు మాయమాటలు చెబుతున్నారు. మోసకారి చంద్రబాబును ఓడించి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలి.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

నాన్న.. జనం మనిషి



మా నాన్న విశ్వేశ్వరరెడ్డి ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన గెలిచినా, ఓడినా జనం మధ్యే ఉంటున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా అహర్నిశలూ శ్రమిస్తున్నారు. పయ్యావుల కేశవ్ బోగస్ పట్టాలు ఇచ్చి ప్రజల చేత ఓట్లు వేయించుకుని ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రజల సమస్యలు పట్టని, నమ్మిన వారిని నట్టేట ముంచే కేశవ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దు.

– వై.ప్రణయ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

- కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఎలెక్షన్ కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి జిల్లాలో ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వసతులు, ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 9,10 తేదీల్లో విజయవాడలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లపై ఆరా తీశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పెనుకొండ సబ్ కలెక్టర్ భరత్, ఆర్డీఓలు భాగ్యరేఖ, రమేష్‌రెడ్డి, వంశీక్రిష్ణారెడ్డితో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమవ్వాలన్నారు. ఓటరు జాబితా వివరాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, అధికారులు, సిబ్బంది నియామకాలు, స్వీప్ ప్రక్రియ, ఓటరు జాబితా ఫిర్యాదులు, పరిష్కారాలు, నూతన ఓటరు నమోదు, పెండింగ్ సమస్యల పరిష్కారం, ఈవీఎం గోడౌన్ ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్లు, కౌంటింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, ఓటరు తొలగింపు, మార్పులు చేర్పులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సమయంలో సీజ్ చేసిన లిక్కర్, డబ్బు, డ్రగ్స్ వివరాలపై నివేదిక అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ మైనుద్దీన్, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

సంక్రాంతికి స్పెషల్ బస్సులు

- 100 సర్వీసుల ఏర్పాటు
- సాధారణ చార్జీలే వసూలు
- ముందస్తు రిజర్వేషన్‌కు రాయితీ



పుట్టపర్తి టౌన్: కొత్త ఏడాదిలో పెద్ద పండుగ సంక్రాంతి రానే వస్తోంది. నగరాల్లో స్థిరపడిన వారు సొంతూళ్లకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. పాఠశాలలకు సెలవులు కూడా ప్రకటించడంతో కుటుంబంతో సహా స్వస్థలాలకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రయాణాలకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు సర్వం సిద్ధం చేసింది.

పండుగ ముగిసిన తర్వాత కూడా..

జిల్లాలోని అన్ని డిపోల నుంచి ఈ నెల 10 నుంచి 13 వరకూ, తర్వాత 16 నుంచి 21 వరకూ బస్సులు తిరుగుతాయి. ముఖ్యంగా హైదరాబాదు, బెంగళూరు, తిరుపతి, విజయవాడ, చెన్నై తదితర ప్రాంతాలతో పాటు లోకల్ రూట్లలో ప్రత్యేక బస్సులు రాకపోకలు సాగిస్తాయి. మొత్తం 100 బస్సులు ఏర్పాటు చేశారు. పండుగ తరువాత కూడా గమ్యస్థానాలకు వెళ్లేందుకు బస్సులు నడుస్తాయి.

సాధారణ చార్జీలే వసూలు..

గతంలో సంక్రాంతి, దసరా పండగల సమయంలో ఏర్పాటు చేసే ప్రత్యేక బస్సు సర్వీసుల్లో అధిక చార్జీలు వసూలు చేసేవారు. సాధారణ చార్జీపై 50 శాతం అధికంగా ముక్కుపిండి తీసుకునేవారు. తామేం తక్కువ కాదన్నట్లుగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాలు వ్యవహరించేవి. సాధారణ చార్జీల కంటే రెండు మూడు రెట్లు అధికంగా లాగి ప్రయాణికుల ఒళ్లు గుల్లచేసేవి. అయితే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అలాంటి పరిస్థితులకు స్వస్తి చెప్పింది. గత నాలుగేళ్లు చేసినట్లుగానే ఈ సారి కూడా ప్రయాణికులపై భారం పడకుండా చర్యలు చేపట్టింది. ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలతోనే ప్రయాణాలు సాగించేలా ఏర్పాట్లు చేసింది. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రిజర్వేషన్లలో 10 శాతం రాయితీ..

ప్రత్యేక బస్సుల్లో రిజర్వేషన్ సదుపాయం కూడా ఆర్టీసీ కల్పించింది. ఒకే సారి రాను పోనూ టికెట్ బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ అందించనుంది. దీంతో సాధారణ చార్జీల కంటే తక్కువ ఖర్చుతో బస్సుల్లో ప్రయాణించే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. ఇక... ప్రయాణికులకు బస్టాండ్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు సూపర్‌వైజర్లను నియమించారు. బస్సుల జీపీఎస్ ట్రాకింగ్, 24 గంటలు సేవలు అందించేలా సమాచార కేంద్రాలు, కాల్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు.

ప్రత్యేక బస్సుల వివరాలు ఇలా..	
హైదరాబాద్	25
బెంగుళూరు	19
తిరుపతి	2
విజయవాడ	7
చెన్నై	5
లోకల్ రూట్లలో	25

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి



సంక్రాంతిని పురస్కరించుకొని ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాం. ప్రయాణికులకు రాయితీలు కూడా అందిస్తున్నాం. జిల్లాకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు స్వస్థలాలకు వచ్చేందుకు వీలుగా 10వ తేదీ నుంచి 100 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాం. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక సర్వీసుల్లో ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా సాధారణ రుసుమే వసూలు చేస్తాం. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లోనే ప్రయాణించి సంస్థ ఆదాయం పెంచాలి.

– మధుసూదన్, డీపీటీఓ



గోల్డ్ మెడల్ అందుకున్న విద్యార్థితో రత్నాకర్ రాజు, చక్రవర్తి, నిమిష్ పాండ్య

విలువల విద్యే 'బాలవికాస్' లక్ష్యం

- సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: విద్యతో పాటు విలువలు నేర్పుతూ పరిపూర్ణుడిగా తీర్చిదిద్దడమే సత్యసాయి బాలవికాస్ కోర్సు లక్ష్యమని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు పేర్కొన్నారు. సత్యసాయి బాలవికాస్ కోర్సు విద్యార్థుల అఖిల భారత 14వ స్నాతకోత్సవం, కృతజ్ఞతా పూర్వక వేడుకలు ఆదివారం కూడా ఘనంగా జరిగాయి. పలువురు పూర్వ విద్యార్థులు తమ అనుభవాలు పంచుకున్నారు. ఒడిశా రాష్ట్రం గంజాంకు చెందిన విద్యార్థులు సంప్రదాయ రణపా నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్‌ను ఆర్‌జే రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, వైస్ చైర్మన్ నిమిష్ పాండ్య అందజేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ రాజు మాట్లాడుతూ బాల్యంలోనే మంచి గుణాలు అలవర్చుకుంటే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్న లక్ష్యంతో బాలవికాస్ విద్యను సత్యసాయి ప్రవేశ పెట్టారని తెలిపారు. దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగానూ ఈ విద్యా విధానానికి మంచి ఆదరణ ఉందన్నారు. కార్యక్రమంలో బాలవికాస్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

క్లుప్తంగా

జిల్లాకు 2,634 మెట్రిక్ టన్నుల యూరియా



ఎరువులు పరిశీలిస్తున్న ఏడీఏ ఎం.రవి

అనంతపురం అగ్రికల్చర్: రబీ ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు ఇఫ్కో కంపెనీ నుంచి జిల్లాకు 2,634 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయింది. ఆదివారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరుకున్న యూరియా బస్తాలను రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కలెక్టర్ జేసీ, డీఏఓ ఆదేశాల మేరకు 1,317 మెట్రిక్ టన్నుల చొప్పున రెండు జిల్లాలకు కేటాయించామన్నారు. ఇండెంట్ మేరకు ఆర్‌బీకేలు, సొసైటీలు, ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు. మిగులు ఎరువులను మార్క్‌ఫెడ్, కంపెనీ గోదాముల్లో నిల్వ చేస్తామన్నారు.

లారీలు ఢీ - ఒకరి మృతి



ఢీకొన్న వాహనాలు

శింగనమల: మండలంలోని నడిమిదొడ్డి సమీపంలో ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి నుంచి బత్తలపల్లి వైపు వెళుతున్న లారీ నడిమిదొడ్డి సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న మరో లారీ పరస్పరం ఢీకొన్నాయి. ఘటనలో తాడిపత్రికి చెందిన లారీ డ్రైవర్ వెంకట్రాముడు, మరో లారీలో ఉన్న ఓడీసీ మండలానికి చెందిన అక్కులప్ప, రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకట్రాముడు (59) మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఆశాజనకంగా 'పట్టు'

- బహిరంగ వేలాల్లో నిలకడగా పట్టు గూళ్ల ధరలు
- కిలో రూ.500 నుంచి రూ.560



వేలానికి సిద్ధంగా ఉంచిన పట్టుగూళ్లు

హిందూపురం: పట్టుగూళ్ల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. సాధారణంగా చలికాలంలో ధరలు విపరీతంగా తగ్గిపోయి రైతులు ఇబ్బంది పడేవారు. అయితే గత నాలుగేళ్లుగా ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. శీతకాలంలోనూ ధరలు రైతులకు ఊరటనిస్తున్నాయి. మరి కొన్ని నెలలు ఇదే పరిస్థితి ఉంటుందని రీలర్లు అంటున్నారు.

రోజూ 6వేల క్వింటాళ్లు..

పదేళ్ల కిందటి వరకూ పట్టుగూళ్లకు సరైన ధరలు లేక రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం జగన్ ప్రభుత్వంలో గిట్టుబాటు ధర లభ్యమవుతుండడంతో పట్టు సాగు చేస్తున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద పట్టుగూళ్ల మార్కెట్‌లలో ఒక్కటైన హిందూపురం మార్కెట్‌కు రోజూ 5,390 నుంచి 6వేల క్వింటాళ్లకు పైబడి పట్టుగూళ్లు చేరుతుండేవి. మడకశిర, గుడిబండ, హిందూపురం, పెనుకొండ, సోమందేపల్లి, లేపాక్షితో పాటు పొరుగున ఉన్న కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా రైతులు పట్టుగూళ్లను ఇక్కడి మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం దిగుబడి క్రమంగా తగ్గుముఖం పడుతున్నా డిమాండ్ మాత్రం బాగానే ఉండడంతో పంట సాగు లాభదాయకంగా ఉంటోందని రైతులు అంటున్నారు. రాష్ట్రంలో చిత్తూరు, కుప్పం, పలమనేరు, మదనపల్లి ప్రాంతాల్లోని పట్టుగూళ్ల మార్కెట్లలో ధరల కంటే హిందూపురంలోనే కాస్తా మెరుగైన ధర ఉంటోందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం బైవోల్టిన్ కిలో రూ.520 నుంచి 560పైగా అమ్ముడు పోతోంది. మేలు రకం పట్టుగూళ్లకు రూ.560పైగా చెల్లిస్తున్నారు.

దేశీయ సిల్క్‌కు పెరుగుతున్న డిమాండ్

ఇటీవల అంతర్జాతీయ మార్కెట్‌లో సిల్క్ దిగుమతి తగ్గడంతో దేశీయ సిల్క్‌కు డిమాండ్ పెరిగింది. దీంతో రీలర్లు పట్టుగూళ్ల కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా మార్కెట్‌లో ధరలు నిలకడగా కనిపిస్తున్నాయి. చైనా సిల్క్ దిగుమతి తగ్గుతుండటంతో బైవోల్టిన్ గూళ్ల ధరలు కాస్తా ఊరటనిస్తున్నాయి.

ఈ నెలలో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు ఇలా...

తేదీ	కనిష్టం	గరిష్టం	సగటు
1	రూ.266	రూ.506	రూ.441
2	రూ.370	రూ.503	రూ.473
3	రూ.336	రూ.528	రూ.465
4	రూ.341	రూ.520	రూ.481
5	రూ.336	రూ.526	రూ.483
6	రూ.401	రూ.535	రూ.504
7	రూ.305	రూ.552	రూ.464

ధరలు నిలకడగా ఉంటున్నాయి



పట్టుగూళ్ల సాగుకు రూ.లక్షలు వ్యయం చేయాల్సి ఉంటుంది. క్వింటాకు కనీస మద్దతు ధర లభ్యమవుతోంది. ప్రభుత్వం కూడా పట్టు రైతులను ప్రోత్సహిస్తుండడం ఎంతో ఊరటనిస్తోంది.

– కిష్టప్ప, పట్టు రైతు, అగళి

భక్తిశ్రద్ధలతో కనకదాస విగ్రహ ప్రతిష్ట



కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (చిత్రంలో) జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు

ఆత్మకూరు: కురుబల ఆరాధ్య దైవం కనకదాస విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఆత్మకూరులో భక్తిశ్రద్ధలతో ఘనంగా సాగింది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించి, విశేష పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్త కనకదాస కురుబలకే కాకుండా అన్ని వర్గాల ప్రజలకూ ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీపీ సుబ్బర హేమలత, మాజీ మేయర్ రాగే పరుశురామ్, కురుబ సంఘ యువ నాయకులు బిల్లే మంజునాథ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బాలపోతన్న, లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పార్వతమ్మ, జిల్లా కార్యదర్శి వెంకట్రాముడు, ధాబా మల్లన్న, నసనకోట దేవాలయ చైర్మన్ ముత్యాలు, కాయగూరల ముత్యాలన్న, సిమెంట్ పోలన్న, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బంధూక మధు, నాట్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ రాగే హరిత, నాయకులు మారెన్న, బిల్లే శివయ్య, రాజశేఖర్, సుబ్బర బాలకృష్ణ, చిట్రా వెంకటేష్, చిట్రా గురు, ఎబ్బిలి పోలన్న, అంజినప్ప, రామకృష్ణ, ఆది, పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి, మాజీ సర్పంచ్ వన్నూరప్ప, గోసుల కొండా, పెట్రోలు హనుమంతు, సుబ్బర అనిల్, దుద్దేకుంట రామాంజినేయులు, ఈశ్వరయ్య, బిల్లే నాగేంద్ర, మాజీ ఎంపీపీ పిల్లల ఈశ్వరయ్య, యువ నాయకులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ ఇన్‌స్పైర్ టోర్నీ విజేత 'అనంత'



ట్రోఫీతో సందడి చేస్తున్న అనంతపురం జట్టు

అనంతపురం: ఆర్డీటీ, ఫౌండేషన్ లాలీగా సహకారంతో అనంత క్రీడా గ్రామం వేదికగా సాగిన అండర్ 17 బాలికల ఫుట్‌బాల్ ఇన్‌స్పైర్ టోర్నీ కప్ విజేతగా అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్టు నిలిచింది. ఇన్‌స్పైర్ కప్ మూడో ఎడిషన్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ముగిసాయి. ఈ పోటీల్లో ఎఫ్‌సీ (గోవా), లిబర్టీ లేడీస్ (తమిళనాడు) లైఫ్ స్పోర్ట్స్(తమిళనాడు) నాంది (గుజరాత్) గుజరాత్ స్పోర్ట్స్ స్కూల్ (,గుజరాత్), అనంతపురం స్పోర్ట్స్ కళాశాల(అనంతపురం), మహిళా జన్ అధికార సమితి(రాజస్తాన్), అనంతపురం యునైటెడ్(ఆంధ్రప్రదేశ్) జట్లు ప్రాతినిధ్యం వహించాయి. మొత్తం 144 మంది యువ ఫుట్‌బాల్ క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో కంపాషన్ ఎఫ్‌సీ జట్టుతో తలపడిన అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్టు 3–0 గోల్స్ తేడాతో ఓడించి చాంపియన్‌గా నిలిచింది.

'సాక్షి' స్పెల్‌బీకి విశేష స్పందన

- సెమీఫైనల్ పోటీలకు హాజరైన కర్నూలు, అనంతపురం జిల్లాల విద్యార్థులు



స్పెల్‌బీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కర్నూలు సిటీ: స్థానిక రవీంద్ర స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన రీజినల్ స్థాయి స్పెల్‌బీ సెమీ ఫైనల్ పోటీలకు విశేష స్పందన లభించింది. అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి నాలుగు కేటగిరీల్లో 58 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థులు తెలిపారు. కొత్త పదాలు పరిచయం కావడంతోపాటు, వాటి ఉచ్చారణ గురించి తెలుసుకున్నామని చెప్పారు. స్పెల్‌బీ ప్రోగ్రామ్ తమ పిల్లల ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంచడమే కాకుండా, మరింత అభివృద్ధి చేసుకునేందుకు దోహపడుతోందని తల్లిదండ్రులు తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఆంగ్ల పరిజ్ఞానం తప్పనిసరి. మంచి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ప్రపంచ భాషగా గుర్తింపు పొందిన ఇంగ్లిష్‌లో నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకు స్పెల్‌బీ వంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ తరహా పోటీలను గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న సాక్షి మీడియా గ్రూప్‌నకు ధన్యవాదాలు తెలిపారు.

ఏడేళ్ల బాలికపై అత్యాచార యత్నం

- పోలీసుల అదుపులో ఇద్దరు మైనర్లు

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ గ్రామంలో ఏడేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు అత్యాచార యత్నం చేయబోయారు. విషయాన్ని గమనించిన బాలిక తండ్రి వెంటనే అప్రమత్తమై బాలురను మందలించి చెట్టుకు కట్టేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని బాలురను అదుపులోకి తీసుకున్నారు. మాయ మాటలతో బాలికను తమతోపాటు నిర్జన ప్రదేశంలోకి బాలురు పిలుచుకెళుతుండగా తండ్రి గమనించి మందలిస్తూ చెట్టుకు కట్టేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు.

పోలీసుల అదుపులో మాజీ నక్సలైట్లు?



గొల్ల నాగరాజు



రామమోహన్



ఓబులేసు



అంజి

పావగడ: తాలూకా పరిధిలోని వెంకటమ్మనహళ్లి వద్ద 2005లో జవాన్ల శిబిరంపై దాడి చేసిన ఘటనకు సంబంధించి అనుమానితులుగా ఉన్న నలుగురు మాజీ నక్సలైట్లను పావగడ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరిలో శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం గంతిమర్రికి చెందిన గొల్ల నాగరాజు, తల్లిమడుగు గ్రామానికి చెందిన బోయ రామమోహన్, బోయ ఓబులేసు, కేఎస్ పాళ్యం గ్రామానికి చెందిన బోయ అంజి ఉన్నారు. 2005లో వెంకటమ్మనహళ్లి వద్ద నక్సలైట్లు జరిపిన బాంబుల దాడిలో తొమ్మిది మంది జవాన్లు మరణించారు. ఘటనకు సంబంధించి అప్పట్లో పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే కేసులో అనుమానితులుగా ఉన్న మరో నలుగురిని ఆదివారం అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

లేపాక్షికి నేడు ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడి రాక

పుట్టపర్తి అర్బన్: ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయ్‌బాబు సోమవారం లేపాక్షికి విచ్చేయనున్నారు. ఈ మేరకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు అనంతపురం నుంచి నేరుగా లేపాక్షికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అనంతరం రోడ్డు మార్గంలో అనంతపురానికి తిరిగి వెళతారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు శ్రీనివాసులు

చిలమత్తూరు: మండలంలోని 44వ జాతీయ రహదారి అంజనీతండా సమీపంలో ఆదివారం ఉదయం చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం మొరంపల్లికి చెందిన శ్రీనివాసులు (42)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూరగాయల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం బాగేపల్లి మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన శ్రీనివాసులు... అంజనీతండా సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా దూసుకెళ్లిపోయాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులును అటుగా వెళుతున్న వారు గమనించి బాగేపల్లిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు.

11న జిల్లా జైలులో వేరుశనగ చెక్క వేలం

బుక్కరాయసముద్రం: మండలంలోని అనంతపురం జిల్లా జైలులో ఈ నెల 11న వేరుశనగ చెక్కకు వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా జైలు సూపరింటెండెంట్ రహమాన్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రాంతీయ జైళ్ల శాఖ ఉపశాఖాధికారి కడప రేంజ్ సమక్షంలో ఉదయం 11 గంటలకు 25వేల కిలోల వేరుశనగ చెక్కకు వేలం పాట ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు రూ.22 వేలు ధరావత్తు చెల్లించాలి. వేలం ముగిసిన తర్వాత ధరావత్తు సొమ్ము వెనక్కు చెల్లిస్తారు.

మెకానిక్ శ్రీధర్‌పై కత్తితో దాడి



ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న శ్రీధర్

కదిరి టౌన్: పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన మెకానిక్ శ్రీధర్‌పై ఎంజీరోడ్డులో ఉన్న బంగారు షాపు బాలు (బాల మురళీకృష్ణ) ఆదివారం రాత్రి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. శ్రీధర్ భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ నారాయణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరిద్దరికీ సెల్‌ఫోన్ల విషయంగా గొడవలున్నాయి. చౌక్ బజారులో మెకానిక్ పనిచేస్తున్న శ్రీధర్ తన కుమారునికి ఇడ్లీ తీసుకెళుతుండగా మీనాక్షి బంగారు షాపు వద్ద బాలు, అతని స్నేహితుడు పవన్ కత్తితో దాడి చేశారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న బాలు మారు తండ్రి సీపీఐ ఇషాక్ సైతం శ్రీధర్‌ను బెదిరించాడు. గాయాలైన శ్రీధర్‌ను వెంటనే కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు నిర్వహించారు. పాత గొడవలే కారణంగా నిర్ధారణ అయినట్లు సీఐ తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వ్యక్తి దుర్మరణం

బుక్కరాయసముద్రం: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు...నార్పల మండలం వెంకటాంపల్లి గ్రామానికి చెందిన నాగముని (47), వెంకట్రాముడు ఆదివారం మధ్యాహ్నం ఒకే ద్విచక్ర వాహనంపై అనంతపురానికి బయలుదేరారు. మార్గమధ్యంలో కొర్రపాడు వద్ద ఉన్న గురుకుల పాఠశాల వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో నాగముని అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. నాగమునితో పాటు ప్రయాణిస్తున్న వెంకట్రాముడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రుడిని అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎస్ఎస్‌బీఎన్ అధ్యాపకులకు పురస్కారాలు

అనంతపురం ఎడ్యుకేషన్: స్వాతంత్య్ర సమరయోధుడు, శతాధిక గ్రంథకర్త పడాల రామారావు శత జయంతి సందర్భంగా అందజేసే స్మారక పురస్కారాలకు అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ నల్లా ఓబిరెడ్డి, వాదుల పల్లి ఫిరోజ ఎంపికయ్యారు. శనివారం రాజమండ్రి వేదికగా జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు పెనుకొండ లక్ష్మీనారాయణ, వల్లూరి శివప్రసాద్, పడాల వీరభద్రరావు, ప్రిన్స్‌పాల్ డాక్టర్ రమణమూర్తి, విశ్వేశ్వర రెడ్డి, పి.సంజీవ రావు, చైర్మన్ సూర్య నారాయణరాజు చేతుల మీదుగా వారు పురస్కారాలు అందుకున్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

- **ఐదు దశాబ్దాల తర్వాత ఏకమై..**

కదిరి: ఒకట్రెండు కాదు.... ఏకంగా 50 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న చిన్ననాటి స్నేహితుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. కదిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1973–74లో పదవతరగతి చదువుకున్న వారందరూ ఆదివారం స్థానిక ఎన్‌జీఓ హోం కలుసుకున్నారు. వీరిలో కదిరి మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ లింగాల శివశంకర్‌రెడ్డి, డీజీఎం సుబ్బరాయుడుతో పాటు పాటు పలు హోదాల్లో ఉద్యోగ విరమణ చేసిన వారు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులూ ఉన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను ఈ సందర్భంగా వారు ఘనంగా సన్మానించారు. అనంతరం ఓ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని తీర్మానించారు.

అనంత సాహిత్యానికి అరుదైన గౌరవం

- రేపు 'అనంత' వేదికగా తెలుగు భాషా వైభవ సదస్సు
- తరలి రానున్న సాహితీ దిగ్గజాలు



శ్రీకృష్ణదేవరాయల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న సినీనటుడు కౌశిక్ బాబు

అనంతపురం / కల్చరల్: 'అనంత' సాహిత్యానికి, సంప్రదాయ కవిత్వానికి, ఆధునిక కృషికి మరోసారి సమున్నత గౌరవం దక్కేలా జిల్లా కేంద్రంలో గొప్ప భాషా సదస్సు జరగనుంది. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జేఎన్‌టీయూ ఆడిటోరియం వేదికగా సాగే 'అనంత' తెలుగు భాషా వైభవ సదస్సుకు పలు ప్రాంతాల నుంచి సాహితీ దిగ్గజాలు, భాషావేత్తలు, ప్రజాప్రతినిధులు తరలి రానున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అనంత సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్న భాషాభిమానులను, రచయితలను, కవులను ఘనంగా సత్కరించనున్నారు. ముఖ్యంగా సాహితీ దిగ్గజాలను ప్రత్యేకంగా గుర్తించి జీవిత సాఫల్య పురస్కారాలు అందిస్తున్నారు. గత ప్రభుత్వాలు తూతూమంత్రంగా నడిపిన అధికార భాషా సంఘాన్ని విస్తృత ప్రయోజనాలు కల్గించేలా తీర్చిదిద్దుతున్న ప్రస్తుత ప్రభుత్వ కృషిని ఇప్పటికే సాహితీవేత్తలు అభినందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలుగు భాష అవసరాన్ని, ఔన్నత్యాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో పలు జిల్లాలలో భాషా సదస్సులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే అనంతలో ఈ నెల 9న ఉదయం నుంచి సాయంత్రం వరకు సాహిత్య, సాంస్కృతిక, కళా ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించేందుకు సంసిద్ధమవుతున్నారు.

పురస్కార గ్రహీతలు వీరే..

ఉమ్మడి జిల్లాలో విశేష కృషి చేస్తున్న సాహితీ మూర్తులను ప్రభుత్వం తెలుగు భాషా సేవా జీవిత సాఫల్య పురస్కారాలకు ఎంపిక చేసింది. డాక్టర్ అమళ్లదిన్నె వెంకటరమణ ప్రసాద్, జయలక్ష్మిరాజ్, చొప్పా వీరభద్రప్ప, ఆచార్య మూడే గోనా నాయక్, షేక్ నబీరసూల్, డాక్టర్ ఆదవాని హనుమంతప్ప, డాక్టర్ కల్లూరి ఆనందరావు, డాక్టర్ కేతు బుచ్చిరెడ్డి, శింతి జయప్రకాష్, జెట్టీ జైరామ్ పురస్కారాలు అందుకోనున్నారు. అలాగే మరో నలభై మంది రచయితలు, కవులకు భాషా సేవా పురస్కారాలను అందించనున్నారు. అనంత కళారూపాలకు ప్రాణం పోస్తున్న మరో నలభై మంది కళాకారులను ఘనంగా సత్కరించనున్నారు.

కార్యక్రమాల వివరాలు

- ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పోల విజయబాబు నేతృత్వంలో జేఎన్‌టీయూ ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రారంభోత్సవ సభ జరుగుతుంది. ముఖ్య అతిథుల ప్రసంగాలు ఉంటాయి. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే సదస్సులో జిల్లా సాహిత్య వైశిష్ట్యం, జిల్లా భాషా వైశిష్ట్యం, జిల్లా పద్యం, జిల్లా ఆధునిక కవిత్వం, అనంతపురం జిల్లా నవలపై ప్రసంగాలతో పాటూ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.
- మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు జిల్లా కథానిక, జిల్లా జానపదం, అనంత జిల్లా నాటకం–బళ్లారి రాఘవ, జిల్లా సాహిత్య విమర్శ, అనంతపురం జిల్లా సాహిత్యంలో హాస్యం వంటి అంశాలపై ప్రత్యేక ప్రసంగాలు, సాంస్కృతిక సంబరాలు ఉంటాయి.
- సాయంత్రం 'జయహో శ్రీకృష్ణదేవరాయ' నృత్య రూపకాన్ని సినీనటుడు 'ఆదిశంకర ఫేమ్' కౌశిక్‌బాబు బృందం ప్రదర్శించనుంది.
- సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ముగింపు సభ, ప్రసంగాలు, పురస్కార ప్రదానాలు ఉంటాయి.